సాక్షి
మంచిర్యాల

మంగళవారం : 8 : ఆగస్టు : 2023



విహారం.. విషాదం
స్నేహితుల దినోత్సవం సందర్భంగా పీజీ వైద్య విద్యార్థులు కలిసి వెళ్లిన విహార యాత్ర విషాదంగా మారింది. వైద్య విద్యార్థి వాగులో గల్లంతు కాగా మృతదేహం లభ్యమైంది. 8లో▸



గద్దర్‌కు ఘన నివాళి
ప్రజా యుద్ధనౌక్ గద్దర్‌కు జిల్లాలోని కళాకారులు, గని కార్మికులు, సంఘాలు, ప్రజాప్రతినిధులు ఘన నివాళి అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను కొనియాడారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /26.0
వాతావరణం
ఆకాశం ఉదయం వేళ పాక్షికంగా, రాత్రివేళ పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సంక్షేమ పథకాల లక్ష్యాలు సాధించాలి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్

నస్పూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాలు పూర్తి స్థాయిలో సాధించే విధంగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హరితహారం, గృహలక్ష్మి, ఇళ్ల పట్టాల పంపిణీ, జీవో 59, నోటరైజ్డ్ భూముల క్రమబద్ధీకరణ, బీసీ కులవృత్తులు, మైనారిటీలకు రూ.లక్ష ఆర్థిక సహాయం తదితర పథకాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ సంతోష్ వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వరకు గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణకు తహసీల్దార్, మున్సిపల్ కార్యాయాలు, కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 21 దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో 73 మద్యం దుకాణాలకు గాను 2023–25 సంవత్సరానికి ఎక్సైజ్ శాఖ అధికారులు ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల నాలుగు నుంచి ప్రారంభం కాగా సోమవారం వరకు 21 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 18 వరకు సమయం ఉండగా మద్యం వ్యాపారులు దుకాణాలను చేజిక్కించుకునేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

తమిళనాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

బెల్లంపల్లి: న్యూఢిల్లీ నుంచి చెన్నయ్ వెళ్తున్న తమిళనాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు వ్యాపించడం కలకలం రేపింది. ఈ ఘటన ఆదివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. తమిళనాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే ఎస్–3 బోగీ వద్ద క్రమంగా పొగలు రావడంతో ప్రయాణికులు భయపడ్డారు. వెంటనే రైల్వే అధికారులు రైలును స్టేషన్‌లో ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయించారు. రైల్వే టెక్నికల్ టీమ్ నిశితంగా తనిఖీ చేసి ప్రమాదమేమీ లేదని, కేవలం రైలు బ్రేక్‌లు చక్రాలకు గట్టిగా పట్టుకోవడంతో పొగలు వ్యాపించినట్లుగా గుర్తించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బ్రేక్‌లను సరి చేసి గంట తర్వాత రైలుకు పచ్చజెండా ఊపారు. దీంతో ప్రయాణికులు, రైల్వే అధికారులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకోగా.. అప్పటి వరకు ఏర్పడిన ఆందోళనకు తెర పడింది.

మైనార్టీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 294 మంది దరఖాస్తు చేసుకోగా 252 మంది హాజరయ్యారు. వీరి దరఖాస్తులు, ఇతర ధ్రువీకరణ పత్రాలను బ్యాంకు అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు, ఎస్‌బీఐ, యూనియన్, దక్కన్ గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి


మంచిర్యాలలో పతాకవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పత్తి సత్తయ్య అన్నారు. సోమవారం మంచిర్యాలలో టీయూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంఘం అధ్యక్షుడు పత్తి సత్తయ్య పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న రవీందర్, సహ అధ్యక్షుడు చిన్నయ్య, కార్యదర్శి సారంగపాణి, వివిధ మండలాల అధ్యక్షులు ప్రకాశ్‌రావు, రవీందర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రైళ్ల రద్దు.. తిప్పలు!


మంచిర్యాల స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు


సింగరేణి మెమూ రద్దయినట్లు చూపిస్తున్న రైల్వే యాప్

- మెమూ ఎక్స్‌ప్రెస్‌ల రద్దుతో ప్రయాణికుల పాట్లు
- తాత్కాలిక మరమ్మతుల పేరిట నిలిపివేత
- రెండు నెలలుగా బల్లార్షా, కాజీపేట మార్గంలో ఇదే తీరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కరోనా తగ్గాక కూడా రైల్వే ప్రయాణికుల కష్టాలు తగ్గడం లేదు. కొంత కాలంగా తరచూ రైళ్లు రద్దు చేస్తున్నారు. మూడో లైన్, పట్టాల మరమ్మతులు, సాంకేతిక, ఇతర జంక్షన్లలోని పనులు కారణంగా చూపుతున్నారు. దీంతో ఎంతోమంది సామాన్య జనం అవస్థలు పడుతున్నారు. కుమురంభీం, మంచిర్యాల జిల్లాల పరిధిలో సిర్పూర్(టి), కాగజ్‌నగర్, రెబ్బెన(ఆసిఫాబాద్ రోడ్), రెచినీ రోడ్, బెల్లంపల్లి, మందమర్రి, రవీంద్రఖని, మంచిర్యాల వరకు అనేక మంది రైలు ప్రయాణం చేస్తుంటారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా, వ్యాపారం, పండుగలు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువ స్టేషన్లలో స్టాప్‌లు ఉండి తక్కువ చార్జీతో నడిచే, సిర్పూర్–కాజీపేట/వరంగల్, భద్రాచలం రోడ్, ఇటు కరీంనగర్ వైపు వెళ్లే మెమూ రైళ్ల రద్దుతో ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాలకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే అధిక సమయం, ఎక్కువ చార్జీ అవుతుంది. తాజాగా బల్లార్షా, కాజీపేట, భద్రాచలం వెళ్లే సింగరేణి మెమూ, కాజీపేట ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ నుంచి వయా పెద్దపల్లి మీదుగా వెళ్లే కరీంనగర్ పుష్పుల్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలికంగా రద్దయ్యాయి.

పట్టాల పనుల పేరుతో..
బల్లార్షా, కాజీపేట మార్గంలో మూడోలైన్ దాదాపు పూర్తయింది. ఆర్‌యూబీ, కొన్ని చోట్ల కల్వర్టులు, మరమ్మతుల పేరుతో నిలిపి వేస్తున్నారు. కొన్ని సార్లు ఈ జంక్షన్‌తో సంబంధం లేకున్నా రద్దు చేస్తున్నారు. డోర్నకల్ విజయవాడ జంక్షన్, బల్లార్షా చంద్రాపూర్ మధ్య ఉన్నా రద్దు చేస్తున్నారు. ఇక సిర్పూర్–కరీంనగర్ పుష్‌పుల్ కూడా ఈ జంక్షన్‌తో సంబంధం లేకున్నా ఆపేస్తున్నారు. స్థానిక రైల్వే అధికారులు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రద్దు చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఎంపీలకు పట్టింపేదీ?
వేలాది మంది తక్కువ చార్జీతో ఎక్కువ దూరం, సుఖవంతంగా ప్రయాణం చేసే అవకాశం ఉన్న రైళ్ల రద్దుపై స్థానిక ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీలు కేంద్ర రైల్వేశాఖను మెప్పించి కొత్త రైళ్ల మంజూరు, హాల్ట్‌ల పెంపు, రైళ్ల రద్దు లేకుండా చూడాల్సి ఉండగా ఆ దిశగా పట్టింపు లేదనే వాదనాలు వినిపిస్తున్నాయి. గత 12ఏళ్లుగా బల్లార్షా, కాజీపేట మధ్య ఒక్క కొత్త రైలు తీసుకు రాలేకపోగా..ఉన్న మెమూ రైళ్లను తరచూ రద్దు చేస్తుంటే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యానికి తోడు తాత్కాలిక రద్దులు
ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ అని తేడా లేకుండా అన్ని రైళ్లు ఆలస్యంగానే నడుస్తున్నాయి. లోకల్ ట్రైన్లుగా భావించే ఈ రైళ్లను తరచూ రద్దు చేస్తూ పునరుద్ధరణలతో అసలు నడుస్తున్నాయా..? లేదా అనే సందేహాలు వస్తున్నాయి. దీంతో సూపర్‌ఫాస్ట్, స్పెషల్ ట్రైన్లు రద్దీగా మారుతున్నాయి. ఉదాహరణకు.. మంచిర్యాల నుంచి కాజీపేట వెళ్లే మెమూ ఎక్స్‌ప్రెస్ రద్దు చేస్తే భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్, వీక్లీ స్పెషల్ ట్రైన్లలో వెళ్లాల్సి వస్తోంది. వీటిలో టికెట్ చార్జీలు అధికం. అంతేకాక ఈ రైళ్లలో సికింద్రాబాద్ వరకు ప్రయాణించే వారితో కిక్కిరిసి ఉంటాయి. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి, ఓదెల, జమ్మికుంట, ఉప్పల్, కాజీపేట మధ్య రాకపోకలు సాగించే వారు సైతం కూర్చునేందుకు చోటు లేకున్నా అదే రద్దీలోనే వెళ్లాల్సి వస్తోంది. ప్రతీ రోజు ఉదయం భాగ్యనగర్ తర్వాత అందుబాటులో ఉండే రైలు ఒక్క కాజీపేట ఎక్స్‌ప్రెస్ మాత్రమే. ఇది గంట వ్యవధితో ఉంటుంది. సూపర్‌ఫాస్ట్, వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు కాక, రెగ్యులర్ నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ కోసం మధ్యాహ్నం వరకు వేచి చూడాలి. భాగ్యనగర్‌కు ఇంటర్‌సిటీ మధ్యలో మరో రైలు లేదు. మళ్లీ అన్ని స్టేషన్లలో స్టాప్ ఉండే సింగరేణి, కాజీపేట ఎక్స్‌ప్రెస్‌లే దిక్కు. వీటినే రద్దు చేస్తుండడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ప్రయాణికుల ఇబ్బందులు



గత రెండు నెలలుగా తరచూ ఏవో కారణాలు చెబుతూ మెమూ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేస్తున్నారు. ప్యాసింజర్ నుంచి ఎక్స్‌ప్రెస్‌గా మార్చి చార్జీలు పెంచినా తీరు మారడం లేదు. ఈ ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులపై స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఇబ్బంది లేకుండా చూడాలి.
– ఫణి, ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం సభ్యుడు

రద్దు చేయడం ఆపాలి



ఎక్కువ మధ్య తరగతి ప్రజలు ప్రయాణించే మెమూ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేయడం సరికాదు. రోజుల తరబడి బంద్ చేస్తే ఈ ప్రాంతం వారు అవస్థలు పడుతున్నారు.
– మాజిద్ హుస్సేన్, ప్రయాణికుడు, కాగజ్‌నగర్

సమస్యల పరిష్కారానికి కృషి

- అదనపు కలెక్టర్ మోతీలాల్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ


గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

నస్పూర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిశీలించి త్వరగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల నాయకులు, మీడియాను అనుమతించాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్ వినతిపత్రం సమర్పించారు.
- ప్రమాదంలో కుడికాలు పూర్తిగా కోల్పోయిన తనకు పింఛన్ ఇప్పించాలని చెన్నూర్‌కు చెందిన కార్పెంటర్ సిరికొండ చిన సత్తయ్య కోరాడు.
- తన కుమారుడు శివకుమార్(19)కు దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని మంచిర్యాలలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన మల్యాల విజయలక్ష్మి కోరింది. పుట్టినప్పటి నుంచి శాశ్వత వైకల్యంతో బాధపడుతున్నాడని, 2015 నుంచి సర్టిఫికెట్ ఉందని పేర్కొంది.

నకిలీ ఫిజియో థెరపిస్టులపై చర్యలు తీసుకోవాలి
జిల్లాలోని పలు ఫిజియోథెరపిస్టు కేంద్రాల్లో నకిలీ ఫిజియో థెరపిస్టుల ద్వారా వైద్యం అందిస్తున్నారని క్వాలిఫైడ్ థెరపిస్టులు ఫిర్యాదు చేశారు. కొన్ని ఫిజియో థెరపిస్టు సెంటర్లలో నకిలీ ఫిజియో థెరపిస్టుల ద్వారా మసాజ్‌లు చేస్తున్నారని, దీనివల్ల క్వాలిఫైడ్ థెరపిస్టులకు ఇబ్బంది కలుగుతోందని పేర్కొన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు.

ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి
నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పలువురు ఏఎన్ఎంలు సమీకృత కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలిపారు. వీరికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మద్దతు పలికారు. అనంతరం గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కళావతి, రాజేశ్వరి, విజయ, స్వరూప, విమల, విజయ, దయామణి, రాధ, పుష్ప పాల్గొన్నారు.

చెరువును కబ్జాదారుల నుంచి కాపాడండి
నస్పూర్ మండలం తాళ్లపల్లి గ్రామం చెరువు శిఖాన్ని పలువురు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని, చెరువు శిఖం కబ్జా కాకుండా కాపాడాలని కౌన్సిలర్ బండారి సంధ్యారాణి కోరారు. చెరువులోకి ఓపెన్ కాస్ట్ మురికి నీరు చేరి నీరు కలుషితం అవుతోందని పేర్కొన్నారు. అధికారులు సింగరేణి యాజమాన్యంతో చర్చించి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


జిల్లా అదనపు వైద్యాధికారికి దరఖాస్తు సమర్పిస్తున్న ఫిజియోథెరపిస్టులు


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు


వినతిపత్రం చూపిస్తున్న కౌన్సిలర్ బండారి సంధ్యారాణి, గ్రామస్తులు

112 ఎకరాలు..

ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ ఆస్తులు

- బస్‌స్టేషన్లు, డిపోలు, నివాస స్థలాలు
- జిల్లా కేంద్రాల్లో విలువైన భూములు సైతం..
- ఉద్యోగుల విలీనం నేపథ్యంలో ప్రాపర్టీలపై చర్చ


మంచిర్యాల బస్ డిపో

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బస్‌స్టేషన్ 3.58 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇది ప్రధాన కూడలి కావడంతో ఇక్కడ గజం విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పలుకుతుంది. ఈ లెక్కన దీని విలువ సుమారు రూ.40 కోట్ల పైమాటే. దీని వెనుకాలే 4.76 ఎకరాల్లో డిపో స్థలం విస్తరించి ఉంది. దీని విలువ సుమారు రూ.65 కోట్లపైనే. నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లోనూ బస్‌స్టేషన్లు, డిపోలు ముఖ్య కూడళ్లలోనే ఉన్నాయి. ఈ లెక్కన వందల కోట్ల విలువైన ఆస్తులను ఆదిలాబాద్ రీజియన్ కలిగి ఉంది.

వందల ఎకరాలు..
ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్‌కు వందల ఎకరాల స్థలాలున్నాయి. ప్రస్తుతం సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన బిల్లు అసెంబ్లీలో ఆమోదం నేపథ్యంలో ఈ ఆస్తుల విషయంపై చర్చ సాగుతోంది. వీటి విలువ రూ. వందల కోట్లలో ఉండడమే దీనికి కారణం. రీజియన్‌లో 30 బస్‌స్టేషన్లు 68.12 ఎకరాల్లో, ఆరు డిపోలు 41.80 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాలలో సిబ్బంది నివసించేందుకు క్వార్టర్స్ 3.5 ఎకరాల్లో ఉన్నాయి.

వాణిజ్యపరంగా ఆదాయంపై దృష్టి..
విలువైన భూములను కలిగి ఉన్న ఆర్టీసీ కొద్దికాలంగా సంస్థ ప్రాపర్టీ సంరక్షణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భైంసా, నార్నూర్, బెల్లంపల్లి, వాంకిడి, జైపూర్, చెన్నూర్, ఇంద్రవెల్లిలో చుట్టూ ప్రహరీలను నిర్మించింది. చెన్నూర్‌లో రూ.4కోట్లతో బస్‌డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇక జిల్లా కేంద్రాల్లోని బస్‌స్టేషన్లను కమర్షియల్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టడం ద్వారా భారీ ఆదాయంపై దృష్టి సారించారు. నిర్మల్‌లో రూ.35కోట్లతో జీ+2 విధానంలో మొదటి అంతస్తులో షాపింగ్ కాంప్లెక్స్, రెండో అంతస్తులో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉంది. రీజియన్ మొత్తంగా ఏడు ఫంక్షన్‌హాళ్లు నిర్మాణం చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. అదే విధంగా ఆర్టీసీ స్థలాల్లో సంస్థ ద్వారానే 11చోట్ల పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో చెన్నూర్ పూర్తయింది. ఈ విధంగా ఎంతో విలువైన స్థలాలను కలిగి ఉన్న సంస్థ వాణిజ్య ఆదాయంపై దృష్టి సారించింది. ప్రభుత్వంలో విలీనం తర్వాత ఈ స్థలాల పరంగా ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఆసక్తికరం.

బస్‌స్టేషన్ల వారీగా భూముల వివరాలు (ఎకరాల్లో)..

బస్‌స్టేషన్	భూవిస్తీర్ణం
ఆదిలాబాద్	3.58
ఉట్నూర్	3.78
నిర్మల్	5.11
భైంసా	1.95
మంచిర్యాల	1.74
ఆసిఫాబాద్	1.93
లక్సెట్టిపేట	1.87
ఖానాపూర్	2.00
జైనథ్	1.00
బజార్‌హత్నూర్	1.00
బెల్లంపల్లి	10.00
వాంకిడి	0.5
కాగజ్‌నగర్	2.00
జన్నారం	1.66
బాసర	2.00
ముథోల్	2.00
మందమర్రి	2.00
చెన్నూర్	2.70
జైపూర్	0.25
బేల	1.00
గుడిహత్నూర్	0.26
బోథ్	0.55
ఇంద్రవెల్లి	1.50
నార్నూర్	1.0
కుభీర్	0.29
పెంచికల్‌పేట్	0.05

డిపోల వారీగా స్థలాలు (ఎకరాల్లో)

ఆదిలాబాద్	4.76
ఉట్నూర్	4.27
నిర్మల్	6.85
భైంసా	7.27
మంచిర్యాల	3.5
ఆసిఫాబాద్	5.45

‘మిషన్ ఇంద్ర ధనుష్’ షురూ

- మూడు విడతల్లో టీకాలు
- టీకాలు వేసేందుకు శిబిరాలు


నస్పూరులో టీకాల కార్యక్రమంలో డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేసేందుకు ప్రత్యేకంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మిషన్ ఇంద్రధనుష్ ప్రారంభించారు. జిల్లాలో మూడు దశల్లో ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్(ఐఎంఐ) వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత తెలిపారు. ఈ నెల 7నుంచి 12వరకు మొదటి దశ, సెప్టెంబర్ 11 నుంచి 16వరకు రెండో దశ, అక్టోబర్ 9 నుంచి 14వరకు మూడో దశను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 149 సబ్‌సెంటర్లు, 17 పీహెచ్‌సీలు, 4 అర్బన్ హెల్త్ సెంటర్లు, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలోని గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారుల సర్వే చేస్తారు. గతంలో టీకాల మోతాదు వేసుకోని, మోతాదు వేసుకోకుండా ఉన్న వారిని గుర్తించి జాబితా రూపొందించి ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఉన్న శిబిరాల్లో టీకాలు వేస్తారు.

పోర్టల్‌లో నమోదు
చిన్నారులు, గర్భిణులకు ఇవ్వాల్సిన సమయాల్లో టీకాలు, వ్యాక్సిన్లను ఇవ్వకపోవడం వల్ల కలిగే అనర్థాలే ఎక్కువ. అందుకే మిషన్ ఇంద్ర ధనుష్‌లో భాగంగా వ్యాక్సిన్ వేసే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం యువిన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చి గర్భిణులు, ఐదేళ్ల చిన్నారులు, టీకా వేసిన, వేయాల్సిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

మంచి అవకాశం
గర్భిణులు, చిన్నారులకు పడాల్సిన టీకా డోసులు అస్సలు పడకపోయినా, ఒక డోసు పడి మరో డోసు పడక పోవడం, గర్భిణులకు వేయాల్సిన డోసులు వేయకపోవడం వల్ల వారిలో వచ్చే ఆరోగ్య సమస్యలు లేకుండా చేసేందుకే మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మూడు దశల్లో శిబిరాలు నిర్వహించనుండగా, 3 మొబైల్ కేంద్రాలు జిల్లా కేంద్రంలో రెండు, నస్పూరులో ఒక్క టీం తిరుగుతుంది. టీకాలు వేసుకోని వారి సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ అనిత, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

‘గృహలక్ష్మి’ దరఖాస్తుల స్వీకరణ


మంచిర్యాలలో దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహలక్ష్మి పథకం అమలు చేస్తోందని, సొంత జాగా కలిగి ఉండి, ఇల్లులేని పేదలు ఇళ్ల నిర్మించుకునేందుకు మహిళల పేరిట రూ.3లక్షలు అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దరఖాస్తుల స్వీకరణను సోమవారం నుంచి ప్రారంభించామని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో మొదటి రోజు 28మంది నుంచి దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్, మేనేజర్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి స్వీకరించారు. దరఖాస్తులు మహిళల పేరిట ఉండాలని, దరఖాస్తుదారులకు ఆహార భద్రత కార్డు ఉండాలని, గృహ సంబంధిత జాగ కలిగి ఉండాలని, సంబంధిత పట్టణంలో నివసిస్తున్నట్లుగా ఆధార్ కార్డు/ఓటర్ గుర్తింపు కార్డు ఉండాలని తెలిపారు.

లక్సెట్టిపేట: గృహలక్ష్మి పథకానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు స్థానిక కార్యాలయంలో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, భూమి పత్రాలు, బ్యాంకుఖాతా పత్రం, దివ్యాంగులు సదరం పత్రం, రెండు ఫొటోలు జిరాక్స్ కాగితాలతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మందమర్రిరూరల్: గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థలంతోపాటు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 10లోగా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ



చెన్నూర్: పట్టణంలోని లైన్‌గడ్డ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లైన్‌గడ్డ కాలనీలో ఫారెస్ట్ క్వార్టర్‌లో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ వెంకట్ నివాసం ఉంటున్నారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలకు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో రూ.2.70 లక్షలు, 2 తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



బాలేష్(ఫైల్)

వాంకిడి: భార్యకు ఆరోగ్యం కుదుటపడటం లేదని మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. మండలంలోని కనర్‌గాం గ్రామానికి చెందిన కొండపర్తి బాలేష్ (39) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. గత మూడేళ్లుగా అతని భార్య పద్మకు వెన్నునొప్పి ఉండటంతో అనేక ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో విరక్తి చెందిన బాలేష్ కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతీరోజు మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. దీంతో దిక్కు తోచని స్థితిలో భార్య తన కూతురు సోని(16)తో కలిసి వారి చేనులో పనులకు వెళ్లేవారు. రోజులాగా ఆదివారం వారు పనులకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకున్న వారికి భర్త ఉరేసుకుని కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న బాలేష్‌ను కిందికి దించి ఓ వాహనంలో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

యువతి అదృశ్యం



శైలజ(ఫైల్)

కాసిపేట: మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన పెంద్రం శైలజ(24) కనపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై గంగారాం కథనం ప్రకారం.. పెంద్రం సోనేరావు, శారద దంపతుల కూతురు శైలజ గతనెల 30న ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లింది. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికిన ఆచూకీ దొరకలేదు. తల్లి శారద ఫిర్యాదు చేయగా సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈజ్‌గాం ఎస్సై రమణ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఈజ్‌గాం మార్కెట్ ఏరియాకు చెందిన కృష్ణ గుప్తా (51) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మాధురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విహారం.. విషాదం

స్నేహితుల దినోత్సవం రోజున విహారం విషాదం నింపింది. సాత్నాల వాగులో గల్లంతైన మెడికో మిత్రుడు క్షేమంగా తిరిగొస్తాడని ఆదివారం రాత్రంతా ఎదురుచూసిన తోటి వైద్య విద్యార్థులకు కన్నీరే మిగిలింది. తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి.

- వాగులో మునిగి పీజీ వైద్య విద్యార్థి మృతి
- ఫ్రెండ్‌షిప్‌డే రోజునే ఈ ఘటన
- మృతదేహం లభ్యం.. కన్నీటి పర్యంతమైన మెడికోలు



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు



గల్లంతు కావడానికి ముందు స్నేహితులతో సరదాగా గడుపుతున్న ప్రవీణ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రిమ్స్‌లో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న 9 మంది మిత్రులు ఆదివారం సాత్నాల వాగు సమీపంలోని కోటిలింగాల వద్దకు వెళ్లారు. వాగులో కాలుజారి భుక్యా ప్రవీణ్‌కుమార్ గల్లంతైన విషయం తెలిసిందే. రాత్రి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. జాలర్లు సోమవారం శవాన్ని బయటకు తీశారు. కళ్లకు గంతలు కట్టినట్లు ఉండటంతో కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. ఆహ్లాదంగా గడిపిన సమయంలో తీసిన ఫొటోలు, వీడియోల్లో తలకు కర్చీఫ్ కట్టి ఉండటాన్ని పోలీసులు చూపించారు. ఏమైనా సందేహాలుంటే తమను సంప్రదించాలని జైనథ్ సీఐ కోలా నరేశ్‌కుమార్ సూచించారు. డైరెక్టర్ ఛాంబర్‌లో విహారయాత్రకు వెళ్లిన వైద్యులతో సీఐ సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చిన్నతనం నుంచే చదవుల్లో మేటి..

సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన భుక్యా ఉస్మాన్ నాయక్ రాథోడ్–లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శేఖర్ నాయక్ వ్యవసాయం చేస్తుండగా చిన్న కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ప్రస్తుతం రిమ్స్‌లో ఆర్థోపెడిక్ పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కాగా 1 నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివాడు. ఆ తర్వాత మొదటి ప్రయత్నంలో ఎంబీబీఎస్ సీటు సాధించగా హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించారు. ఆ తర్వాత తన స్వంత జిల్లాలోని ముస్తాబాద్‌లోని పీహెచ్‌సీలో మూడు నెలలపాటు మెడికల్ ఆఫీసర్‌గా సేవలందించారు. పీజీ సీటు రావడంతో రిమ్స్‌లో చేరాడు. ప్రయోజకుడై కుటుంబానికి అండగా నిలుస్తాడని అనుకున్న కొడుకు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉన్న రెండెకరాల భూమిని సాగు చేసి, కూలీ పనిచేస్తూ చదివించినట్లుగా పేర్కొంటూ రోదించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టింది. కాగా బీఆర్‌ఎస్ నాయకుడు రంగినేని పవన్‌రావు ఫోన్‌లో బాధిత కుటుంబీకులను మంత్రి కేటీఆర్ పరామర్శించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు.

స్నేహితుల దినోత్సవం రోజే

ఆదివారం స్నేహితుల దినోత్సవం ఉండటంతో 9 మంది తోటి స్నేహితులు తొలుత కుంభఝరి సమీపంలోని కోటి లింగాలను దర్శించుకున్నారు. వీరిలో నలుగురు పురుష వైద్యులు ఉండగా ఆరుగురు మహిళా వైద్యులు ఉన్నట్లుగా రిమ్స్ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత సరదాగా నీటిలో ఆటలాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఇంటికి బయల్దేరే క్రమంలో నీటిని దాటుతుండగా ప్రవీణ్ సెల్‌ఫోన్ నీటిలో పడిపోవడంతో దాన్ని తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బండపై నాచు ఉండటంతో కాలు జారి నీటిలో పడ్డాడు. స్నేహితులు కార్తీక్, రాజు కాపాడేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది. ప్రవీణ్ గుండంలో చిక్కుకుపోయాడు. వీరిద్దరిని కాపాడేందుకు మిగతా స్నేహితులు ప్రయత్నించగా వీరు సురక్షితంగా బయటపడ్డారు. అప్పటికే ప్రవీణ్ గల్లంతయ్యాడు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, గ్రామస్తులు వాగు వద్దకు చేరుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మరి కొందరు వైద్యులు అక్కడకు చేరుకుని గజఈతగాళ్ల ద్వారా గాలింపు చేపట్టారు. రాత్రి 10 గంటల వరకు ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు, గ్రామస్తులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఉండేలా వలలు కట్టి ఉంచారు. సోమవారం ఉదయం 6 గంటలకే తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా 8 గంటల ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు ప్రవీణ్ భౌతికకాయాన్ని అప్పగించారు.

కన్నీటి పర్యంతమైన రిమ్స్

పీజీ విద్యార్థి మృతిచెందాడని తెలియగానే రిమ్స్ మెడికోలు, వైద్యులు, సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు. పోస్టుమార్టం అనంతరం డైరెక్టర్ ఛాంబర్ ఎదుట మృతదేహాన్ని ఉంచి నివాళులర్పించారు. కుటుంబీకుల రోదనలతోపాటు తోటి పీజీ విద్యార్థులు, మెడికోలు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు సుమలత, శ్యాంప్రసాద్, వెంకట్‌రెడ్డి, జాడే తానాజీ, అధికారులు పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.



నివాళులర్పిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్

చెక్‌పోస్టు గేటు ధ్వంసం

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాళ్లపేట చెక్‌పోస్టు గేటును డీసీఎం వాహనం ఢీకొట్టి ధ్వంసం చేసిన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎరుపు రంగు గల డీసీఎం జన్నారం నుంచి లక్సెట్టిపేట వైపు అనుమానాస్పదంగా వెళ్తుందని సమాచారంతో తాళ్లపేట రేంజ్ అధికారి రత్నాకర్‌రావు తపాలాపూర్ చెక్‌పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేశారు. చెక్‌పోస్టు డ్యూటీలో ఉన్న సెక్షన్ అధికారి రాజవ్వ, బేస్ క్యాంపు సిబ్బందితో చెక్‌పోస్టు గేటును కిందికి దించారు. డీసీఎం వాహనం వైపు టార్చిలైట్ వేస్తూ ఆపాలని సూచించినా అతివేగంగా గేటును ఢీకొట్టి వెళ్లారు. సుమారు 500 మీటర్ల దూరంలో చెట్టుకు ఢీకొట్టి డీసీఎం ఆగింది. అందులో ఉన్న వ్యక్తులు పరారయ్యారు. సిబ్బంది వాహనం పరిశీలించగా 25 పశువులున్నాయి. సెక్షన్ అధికారి రాజవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీఐఎస్‌ఎఫ్ కాలనీలో నివాసముండే లక్ష్మణ్ అనే సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ జరిగిన విషయం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గతనెల 31న లక్ష్మణ్ హైదరాబాద్‌లో గృహప్రవేశం కార్యక్రమానికి వెళ్లి ఆదివారం రాత్రి మందమర్రికి వచ్చాడు. ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉంది. బీరువాలో తులంన్నర బంగారు ఆభరణాలతోపాటు కొంత వెండి ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సోమవారం స్థానిక పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిరసన

కాసిపేట: మండలంలోని మల్కేపల్లి, ధర్మరావుపేట గ్రామాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సోమవారం బీజేపీ నాయకులు విద్యార్థులతో కలిసి వాగులో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ మండల ఇంచార్జీ అట్కాపురం రమేష్ మాట్లాడుతూ బ్రిడ్జి లేక స్థానిక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. స్కూల్ విద్యార్థులు తిరిగి వెళ్లేందుకు చార్జీల భారం పడుతోందని తెలిపారు. నాయకులు మహేందర్, లింగయ్య, తిరుపతి, జానేష్, సాగర్, శ్రీకాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫాగింగ్ యంత్రం నుంచి మంటలు

- ఇద్దరికి గాయాలు



ఫాగింగ్ యంత్రం నుంచి వచ్చిన మంటలు

చింతలమానెపల్లి: దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రం నుంచి మంటలు వచ్చాయి. మండలంలోని బాలాజీ అనుకోడ పంచాయతీలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారోబార్ చాపిడె గణేశ్, తాత్కాలిక కార్మికుడు జంగెపల్లి శంకర్‌కు గాయాలయ్యాయి. ఫాగింగ్ యంత్రం నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చి పొగ గొట్టం పైవు దాకా వ్యాపించాయి. వారికి గాయాలయ్యాయి. స్థానికులు మంటలార్పి వేశారు. సమాచారం అందుకున్న సర్పంచ్, కార్యదర్శులు గాయాలైన కార్మికులను రవీంద్రనగర్ పీహెచ్‌సీకి తరలించారు. ఎంపీడీవో సత్యనారాయణ సోమవారం కార్మికులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

సంతానం కలగడం లేదని వివాహిత ఆత్మహత్య



సుజాత మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: పెళ్లయి ఐదేళ్లవుతున్నా సంతానం కలగడం లేదనే మనస్తాపం చెంది వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై మధుకర్ కథనం ప్రకారం.. చింతలమానెపల్లి మండలంలోని టేకంగూడకు చెందిన ఎడ్ల సుజాత (24)కు కౌటాల మండలం కనికి గ్రామానికి చెందిన ఎడ్ల సంతోష్‌తో ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందిన సుజాత ఆదివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు కాగజ్‌నగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి లస్మయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సోమవారం సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రిలో సుజాత మృతదేహాన్ని కౌటాల సీఐ సాధిక్‌పాషా, తహసీల్దార్ సాయన్న పరిశీలించి వివరాలు సేకరించారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

బెల్లంపల్లి: పట్టణంలోని షంషీర్‌నగర్ బస్తీకి చెందిన నలిమెల శ్రీనివాస్ (29) అనే యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ ఎస్సై పి.ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. 8 ఏళ్ల క్రితం అదే బస్తీకి చెందిన స్వాతిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు మగ సంతానం. పెళ్లైనప్పటి నుంచి శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని ఎన్నిసార్లు కోరినా వినకుండా భార్యతో పలుమార్లు గొడవ పడ్డాడు. పంచాయితీలు జరిగినా అతని వైఖరిలో మార్పు రాలేదు. తాగడానికి డబ్బులు ఇవ్వకపోతే ఇంట్లో వస్తువులను అమ్ముకుని మద్యం తాగేవాడు. ప్రసవం కోసం స్వాతి పుట్టింటికి వెళ్లగా ఆదివారం ఇంట్లో శ్రీనివాస్ గడ్డి మందు తాగాడు. సమాచారం రావడంతో స్వాతి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి పంపించారు. చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. భార్య స్వాతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



రాజలింగును సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఉత్తమ ఫ్యామిలీ కౌన్సిలర్ అండ్ ఆర్బినేటర్‌గా ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డు అందుకున్న న్యాయవాది మోతే రాజలింగును జిల్లా కేంద్రంలో బీసీ ఐక్యవేదిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి ప్రజలను చైతన్యం చేయడంలో రాజలింగు చూపించిన చొరవతో చాలా సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక నాయకులు కుమార్, మహేష్, వేణు, కనకయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని చిలాటిగూడలో ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన పాలే బాలాజీ (43)కి భార్య కళావతి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యతో గొడవలు జరుగుతున్నాయి. గత నాలుగు నెలల క్రితం కళావతి తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో బాలాజీ ఒంటరిగానే ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు నిద్రలేవకపోవడంతో తమ్ముడు, గ్రామస్తులు తలుపు తీయగా మంచంపై చనిపోయి ఉన్నాడు. ఎస్సై రాజేశ్వర్ అక్కడికి వెళ్లారు. వీఆర్‌ఏ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టుదలతో ఎస్సై కొలువు సాధించారు

జిల్లాలోని పలువురు యువత పట్టుదలతో చదివి ఎస్సైగా కొలువు సాధించారు. కొందరు మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించగా.. మరికొందరు వేర్వేరు ఉద్యోగాలు చేస్తూనే ఖాకీగా కొలువు దీరనున్నారు.

సామాన్య కుటుంబం..



రాజశేఖర్

కోటపల్లి: పట్టుపట్టి సామాన్య కుటుంబానికి చెందిన రాజశేఖర్ ఎస్సై ఉద్యోగం సాధించాడు. అన్నారం గ్రామానికి చెందిన కొడూరి శంకర్, జయ దంపతుల కుమారుడు రాజశేఖర్ పదో తరగతి వరకు గురుకుల రెసిడెన్షియల్‌లో చదివి, ఇంటర్ కరీంనగర్‌లోని ప్రైవేట్ కళాశాల, బీటెక్ జేఎన్‌టీయూలో అభ్యసించాడు. 2018లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో ఉద్యోగం చేస్తూనే ఎస్సై పరీక్షకు సన్నద్ధం అయ్యాడు. రాజశేఖర్‌ను గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

రైతు కుటుంబం నుంచి..



తిప్పని నాగశిల్ప

లక్సెట్టిపేట/దండేపల్లి: లక్సెట్టిపేట మండలంలోని గంపలపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న తిప్పని నాగశిల్ప ఎస్సై ఉద్యోగానికి ఎంపికైంది. పదవ తరగతి వరకు స్థానిక గుడ్ షెప్పర్ పాఠశాల, ఇంటర్మీడియట్ కరీంనగర్‌లోని సహస్ర జూనియర్ కళాశాల, బీటెక్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసింది. స్వగ్రామం దండేపల్లి మండలం కొర్విచెల్మ కాగా.. తండ్రి తిరుపతి వ్యవసాయం, తల్లి శ్రీలత గృహిణి. కష్టపడి చదివి కోచింగ్ లేకుండా పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది.

అన్నను స్ఫూర్తిగా తీసుకుని..



ఎండీ సర్దాజ్‌పాషా

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణంలోని మజీద్‌వాడకు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఎండీ.రఫిక్, ఉన్నీసాబేగం దంపతుల కుమారుడు ఎండీ.సర్దాజ్ పాషా సివిల్ ఎస్సై ఉద్యోగం సాధించాడు. బీటెక్ తర్వాత ఉద్యోగ వేటలో ఉన్నాడు. అన్న ఎండీ.సిరాజ్ టీఎస్‌ఎస్‌పీ 13వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అన్నను పోలీస్ యూనిఫామ్‌లో చూసి స్ఫూర్తి పొంది 2017లో రెండో ప్రయత్నంలో టీఎస్ఎస్‌పీ 2వ బెటాలియన్ ఆదిలాబాద్‌లో ఉద్యోగం సాధించాడు. ఇంకా పై స్థాయికి స్థాయికి వెళ్లాలన్న పట్టుదలతో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూనే ఎస్సై కోసం ప్రయత్నించాడు. శిక్షణ లేకుండానే సొంతగా సాధన చేసి కొలువు సాధించాడు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం



కోటేశ్వర్

బెజ్జూర్: మండలంలోని మారుమూల గ్రామం సోమినికి చెందిన పెగడపల్లి శంకర్, అమృత దంపతులు వ్యవసాయం చేస్తూ కుమారుడు కోటేశ్వర్‌ను చదివించారు. తల్లిదండ్రుల ఆశయాన్ని నిలబెట్టేందుకు కష్టపడి చదివి ఎస్సై ఫలితాల్లో 228 మార్కులతో రాణించాడు. సిద్దిపేట జిల్లాలో ఉచిత కోచింగ్ సెంటర్‌లో సన్నద్ధమై ఎస్సై ఉద్యోగం సాధించగలిగానని, కుటుంబీకుల ప్రోత్సాహం ఎంతో ఉందని కోటేశ్వర్ తెలిపాడు.

వ్యవసాయ కుటుంబం నుంచి..



వెంకటేశ్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని గ్రామానికి చెందిన ఆదె వెంకటేశ్ వ్యవసాయ కుటుంబం నుంచి ఎస్సైగా ఉద్యోగం సాధించాడు. ఆదె పోచయ్య, శ్రవంతాబాయి దంపతుల రెండో సంతానం వెంకటేశ్ ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యనభ్యసించాడు. 2020లో 13వ బెటాలియన్‌లో టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఆన్‌లైన్‌లో క్లాసులు వింటూ శిక్షణ పొంది ఇటీవల నిర్వహించిన ఎస్సై పరీక్షల్లో విజయం సాధించాడు. వెంకటేశ్ సోదరుడు తిరుపతి కూడా 2018లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి ప్రస్తుతం సీఎం ఇంటలిజెన్స్ సెక్యూరిటీలో పనిచేస్తున్నాడు. ఆయన స్ఫూర్తితోనే ఉద్యోగం సాధించానని, తన మేనమామ కొట్రంగి నాందేవ్, తల్లిదండ్రులు ఎంతగానో ప్రోత్సహించారని వెంకటేశ్ తెలిపాడు.

నాన్న కళ్లలో ఆనందం చూడాలని...



తండ్రి బుచ్చయ్యతో శివశంకరవర ప్రసాద్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణంలోని ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన జే.బుచ్చయ్య, ప్రేమలత దంపతుల కుమారుడు శివశంకర వరప్రసాద్ ఎస్సైగా ఎంపికయ్యాడు. తండ్రి కూలీ పని చేస్తూ చదివించాడు. ఆయన కష్టం చూసి చలించిపోయి తండ్రి కళ్లలో ఆనందం చూడాలని ఏదో ఒక ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో రెండు నెలల క్రితం కోర్టులో టైపిస్ట్ ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం చేస్తూ ఎస్సై కావాలన్న పట్టుదలతో ఇంటి దగ్గరనే ఎలాంటి కోచింగ్ లేకుండా సాధన చేశాడు. బీఏ, డీఈడీ, బీఎల్ఐఎస్‌సీ విద్యను పూర్తి చేశాడు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా తన వంతుగా కృషి చేస్తానని శివశంకరవరప్రసాద్ తెలిపాడు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా



చాపిల సంతోష్(ఫైల్)

దహెగాం: అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడడంతో యువకుడి మృతి చెందిన సంఘటన మండలంలోని లగ్గాం సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. కర్జి గ్రామానికి చెందిన పసుల తుమ్మిడె వెంకటికి చెందిన ట్రాక్టర్‌లో డ్రైవర్ రౌతు సంతోష్, చాపిల సంతోష్‌తో కలిసి ఆదివారం అర్ధరాత్రి వంట చెరుకుతో దహెగాం వచ్చారు. వాటిని అమ్ముకుని తిరుగు ప్రయాణంలో లగ్గాం, పెంచికల్‌పేట్ క్రాస్‌రోడ్డు దాటాక ట్రాక్టర్ అదుపు తప్పి పొలాల్లో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చాపిల సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రౌతు సంతోష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి సోదరుడు ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. మైనర్ అయిన డ్రైవర్ రౌతు సంతోష్, ట్రాక్టర్ యాజమాని పసుల తుమ్మిడె వెంకటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న పోచయ్య

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం పోతెపల్లి గ్రామంలో పదిరోజుల క్రితం ఆదివాసీల ఆరాధ్య దైవం లక్ష్మీదేవర ప్రతిమలను దహనం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆదివాసీ కోలావార్(మన్నెవార్) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య డిమాండ్ చేశారు. మండ ల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీలు పవిత్రంగా కొలిచే అమ్మవార్ల ప్రతిమలను దహనం చే యడం హేయమైన చర్యగా అభివర్ణించారు. దుండగులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి శిక్షించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు నాయకులతో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు బుర్స రంగయ్య, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు బుర్స వెంకటేశ్, మండల అధ్యక్షుడు పసుల సత్తయ్య ఉన్నారు.

బాలిక కిడ్నాప్‌నకు యత్నం

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో మైనర్‌బాలిక కిడ్నాప్‌నకు యత్నించిన ఘటన ఏసీసీలో ఆదివారంరాత్రి చోటుచేసుకుంది. బాలిక కుటుంబీకులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు బాలికను పోలీసులు విచారించగా ఓ మహిళ, ఇద్దరు పురుషులుమినీవ్యాన్‌లో వచ్చి తనను ఎత్తుకెళ్లారు. చాకచక్యంగా తప్పించుకుని ఇంటికి వెళ్లానని తెలిపింది. సీఐ రాజు ప్రత్యేక పోలీసులతో ఏసీసీ ప్రాంతంలో అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. సీసీ కెమెరాలు పరిశీలించగా బాలిక ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లిన దృశ్యాలను గుర్తించారు. బాలిక మాటల్లో స్పష్టత లేదని సీఐ రాజు తెలిపారు.